తిరిగే అవసరం లేకుండా లాయరు దగ్గరే పత్రాలు రాసుకుని విడిపోతారు. విడిపోయిన తర్వాత పుట్టింటికి వెళ్ళకుండా వేరేగా ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటుంది. తన ఒంటరితనాన్ని మర్చిపోవడానికి సంగీత సాధన, స్నేహితులతో షికార్లు, ప్రయాణాలు చేస్తుంది. అవి ఏవి ఆమెకు సంతృప్తిని ఇవ్వవు. అనాధ శరణాలయం నుండి ఒక పాపను తెచ్చుకుని పెంచుతుంది. ఆ శరణాలయంలోని పదిమంది పిల్లల ఆలనాపాలనా ఖర్చుల భరిస్తూ దత్తత తీసుకుంటుంది. ఈ వివరాలన్ని చైతన్యకు రేవతికి తన స్నేహితురాలు కల్పనకు రాసిన ఉత్తరం ద్వారా తెలుస్తుంది. నిజం తెలుసుకున్న చైతన్య ఆమె ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతిస్పందనగా చైతన్య స్థాపించబోయే సంస్థలకు రేవతి పేరును పెట్టాలని నిర్ణయించుకుంటాడు. ఈ వివరాలేవి తెలియని వినీల, మహేంద్రలు చైతన్య నిర్ణయాన్ని తప్పుపడతారు. వినీల, మహేంద్రలకు, ఆ ఉత్తరాన్ని ఇచ్చి చదవమంటాడు చైతన్య. ఆ ఉత్తరాన్ని చదివిన వాళ్ళిద్దరూ కూడా పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. తన కన్నతల్లిని కఠినాత్మురాలిగా భావించిన మహేంద్ర నిజం తెలుసుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తాడు. తమ బాగోగుల కోసం రేవతి జీవితాన్నే త్యాగం చేసిందని వినీల కంట నీరు ధారలు కడతాయి.

ఈ కథలో అన్ని పాత్రలు ఉదాత్తమైనవి, ఆదర్శవంతమైనవిగానే చిత్రించారు. కుటుంబ జీవనమంటే ఒకరికోసం ఒకరిగా జీవించడం. ఒకరి ఆనందం కోసం వేరొకరు పరితపించటం. అలా ఉన్నప్పుడే కుటుంబ వ్యవస్థ కలకాలం నిలబడుతుంది. చైతన్య ఆనందం కోసం రేవతి త్యాగం చేయడం, రేవతి త్యాగం తెలిసి చైతన్య తన ప్రతిస్పందన తెలియజేయడానికి తన సంస్థలకు ఆమె పేరును పెట్టడం. కన్నతల్లి చేసిన త్యాగం తెలియక ద్వేషించిన మహేంద్ర తర్వాత నిజం తెలుసుకుని ఆమె దగ్గరికి వెళ్ళాలనుకుంటే పెంచిన తల్లి ఆనందంగా వెళ్ళిరా నేటి నుండి నువ్వు ఇద్దరు తల్లులున్న అదృష్టవంతుడవి అని చెప్పి పంపించడమూ. పాఠకుడి హృదయంలో కలకాలం నిలిచేటట్లు కథను మలిచారు రచయిత్రి. రచయిత్రి రచనా వైదుష్యానికి చక్కటి ఉదాహరణగా నిలిచింది ఈ కథ. కుటుంబ సంబంధ కథలు తర్వాత చెప్పుకోదగ్గవి ప్రణయ సంబంధ కథలు.

## 2.2 ప్రణయ సంబంధ కథలు :

గోగినేని మణి కుటుంబ సంబంధ కథలు రాయటమే కాకుండా ప్రణయ సంబంధమైన కథలు కూడా రాశారు. వీరి కథల్లో ప్రణయానికి సంబంధించిన విషయాలు సరికొత్త కోణంలో ఆవిష్కరించి విషయాన్ని సూటిగా చెప్పకుండా ఉత్కంఠభరితమైన శైలిలో కథలను

తీర్చిదిద్దారు. పాత్రలు, సంభాషణలు, కథాకధన శైలిలో ఒక విలక్షణతను ప్రదర్శించారు. ప్రణయం జీవితంలో ఒక ప్రధానమైన అంశం. ప్రకృతి ప్రేమకు సంకేతం. అలాగే కుటుంబంలో ఉండే ప్రేమ, వాత్సల్యం ఒక రకమైనదైతే, యువతీ, యువకుల మధ్య ఉండేది. మరొక రకమైనది. అలాగే భార్యాభర్తల మధ్య ఉండే ప్రేమ, ప్రేమికుల ప్రణయం, భగ్న ప్రేమికుల ప్రణయం ఇలా అనేక విషయాలను కథా వస్తువుగా తీసుకుని గోగినేనిమణి ప్రణయ కథలను రాశారు.

వీరి కథల్లో అంతర్లీనంగా నీతి, ధర్మం కనిపిస్తాయి. అంతేకాకుండా కొన్ని కథల్లో ప్రధాన పాత్రల ప్రాయశ్చిత్తాన్ని, ఆత్మ విమర్శనను, సత్యశోధనను అంతర్లీనంగా చిత్రించారు. ప్రారంభం దగ్గరనుండి ముగింపువరకు రచయిత్రి ప్రణయ కథల్లో వర్ణనాత్మకంగా, భావస్ఫోరకంగా, శృంగార రసాత్మకంగా, అలంకార శోభితంగా, కొత్త సూక్తుల సమాహారంగా రచించినట్టు వారి కథలను బట్టి విశ్లేషించవచ్చు. ఎక్కువగా సాంఘిక ధర్మాన్ని, సంప్రదాయాన్ని సంరక్షించే విధంగా ఇతివృత్తాన్ని ఎన్నుకొని సాధ్యమైనంత వరకు భిన్నత్వంలో ఏకత్వాన్ని, ప్రణయంలో పవిత్ర ప్రేమను చూపించే ప్రయత్నం చేసారు. వీరి కథలను పరిశీలిస్తే ప్రణయతత్త్వం ఎంతవరకు పోషించబడిందో తెలుస్తుంది.

## 2.2.1 ప్రేమలేఖ :

కథలో ప్రధానమైన పాత్రలు అరవింద, భాస్కర్. వీరిద్దరూ కొత్తగా పెళ్ళైన భార్యభర్తలు. అరవింద తన స్నేహితురాలు రమ్యని కలవడానికి వెళ్ళి వచ్చినప్పటి నుండి పరధ్యానంగా ఉంటుంది. అలా పరధ్యానంగా ఉన్న భార్యతో "లోకమంతా చీకటిలో మునిగిపోయినట్లు" దిగులుగా ఎందుకున్నావని భాస్కర్ వేళాకోళంగా అంటాడు. తన స్నేహితురాలు రమ్యకి పెళ్ళి నిశ్చయమైంది అని చెబుతుంది అరవింద. మంచి సంబంధం అని అంటుంది. ఆమెకు పెళ్ళి నిశ్చయమైతే నీకు విచారమెందుకని ప్రశ్నిస్తాడు భాస్కర్. నీకేం తక్కువైంది. ఆమె కంటే ఆర్నెల్లు ముందే అయిందిగా అని వేళాకోళమాడతాడు. తనకేం తక్కువైందో ఈ రోజే అర్థమయ్యింది అని అంటుంది. రమ్య తన కాబోయే భర్త రాసిన ఉత్తరాన్ని చదువుతుంటే తాను చూసినట్లు చెబుతుంది. రమ్యకు పెళ్ళి నిశ్చయమైంది కాని దగ్గరలో ముహుర్తాలు లేక మధ్యలో మూడు నెలలు గడువు వస్తుంది. కావున ఆమెకు కాబోయే భర్తకు మధ్య ఉత్తరాలు నడుస్తున్నాయి అని భర్తతో చెబుతుంది అరవింద. మధ్యలో నీకొచ్చిన ముప్పేమిటి అని ప్రశ్నిస్తాడు భాస్కర్. మీరు ఒక ప్రేమ లేఖ రాయాలి అని అంటుంది అరవింద.

భాస్కర్ ఒక్కసారిగా అవాక్కవుతాడు. భార్యను ఆట పట్టించడానికి "అతనికి పోటీగా నేనెందుకూ రాయటం? అయినా పెళ్ళయిన వాడిని, పెళ్ళి కుదిరిన అమ్మాయికి రాయటం తప్పు కాదూ?"[16] అంటాడు

ప్రేమలేఖ రాయమంటుంది నా స్నేహితురాలికి కాదు, నాకు అని అంటుంది. మనకి పెళ్ళయి పోయిందిగా అని అంటాడు భాస్కర్. అయితే ఏం ప్రేమ ఉండదా అని ప్రశ్నిస్తుంది అరవింద. నా ప్రేమను చూపించడానికి మాటలతో పని ఉండదు. నేను చేతల మనిషిని అని అంటూ బార్యను కౌగిలించుకుంటాడు. అరవింద భర్త నుండి విడిపించుకుంటూ తన కోరికను వెలిబుచ్చుతుంది. తనకొక అందమైన ప్రేమలేఖ రాయాలని చెబుతుంది. అదొక అపురూపమైన అనుభూతిలా మనసులో ఉండిపోవాలి అని అంటుంది.

భార్య కోరికను విని ఆశ్చర్యపోతూ నీ స్నేహితురాలికి దురదృష్టం కొద్దీ మూడు నెలల వరకు ముహూర్తాలు లేవు. కాబట్టి ఉత్తరాలతో తంటాలు పడుతున్నారు. మనకా గొడవ లేకుండా నిశ్చయమైన పది రోజులకే పెళ్ళయిపోయింది. అప్పటి నుండి ప్రతి రాత్రి వసంతరాత్రిలా గడచిపోతుంది కదా అని అంటాడు. భర్త మాటలు విన్న అరవింద మనసు నొచ్చుకుంటుంది. భర్తతో ఇలా అంటుంది. "నేనేం కాదన్నానా? విడాకులు కావాలన్నానా? మొగలి పూల గాలి ముత్యాల వానలా మురిపించే ఒక ప్రేమ లేఖ కావాలని అన్నాను అంతేగా"[17] ఆమె ప్రశ్నకు సమాధానంగా భాస్కర్ విసుక్కుంటూ తనకసలు ఉత్తరాలు రాసే అలవాటు లేదని, తను చదువుకునే సమయంలో కూడా యూనివర్శిటిలో ఉండగా తన ఉత్తరం వచ్చిందంటే ఇంట్లో వాళ్ళంతా కంగారు పడిపోయేవాళ్ళని అంటాడు. ఎందుకని భార్య ప్రశ్నిస్తుంది. తనకి జబ్బు చేస్తే కానీ, డబ్బు కావల్సి వస్తేనో తప్ప ఉత్తరాలు రాసేవాడిని కాదని భాస్కర్ అంటాడు. భర్త మాటలు విన్న అరవింద నిరాశతో అలాంటి ఉత్తరాలు కావు. ఉత్తరం అంటే మళ్ళీ మళ్ళీ చదువుకునేటట్లు ఉండాలి అని అంటుంది. అప్పుడు భాస్కర్ చమత్కారంగా నా ఉత్తరాన్ని ఎవరైనా సరే మళ్ళీమళ్ళీ నాలుగైదుసార్లు చదవాల్సిందే. ఎందుకంటే మొదటి సారైతే రైటింగ్ అర్థం కాదులే అని అంటాడు. భర్త మాటలు విన్న అరవింద చిరుకోపంతో అలా హడావుడిగా కాకుండా తీరుబడిగా కూర్చొని... అందమైన

---

**16. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 16**

**17. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 16**

ఆలోచనలను అక్షరాల్లో పొదిగి అని సాగదీస్తుంటే, నీ గుండెల్లో ఒదిగిపోవటం తెలుసుకునే ఆ పొదగటం నాకు చేతకాదు అంటాడు భాస్కర్. ఎందుకు చేతకాదని ఎదురు ప్రశ్నిస్తుంది అరవింద.

రమ్యకు తన కాబోయే భర్త రాసిన ఉత్తరాన్ని తనకి చదవమని ఇచ్చిందని, అందులో రమ్యను అతను వర్ణించిన తీరును ఇలా చెబుతుంది. "పేరు మాత్రమే కాదు రూపం రమ్యాతిరూపం! ఆ అధరాల సంగతి తెలియదు గానీ మాటలు మాత్రం మధురాతి మధురం...! ఇక ఆమానసం నవ్యభావాల రసరమ్య కావ్యం!"[18] ఇలా నాలుగు పేజీల నిండా వర్ణించాడని భాస్కర్‌తో చెబుతుంది అరవింద. అది విన్న భాస్కర్ కూలబడిపోతూ ఇలా అంటాడు. హతోస్మి! కంఠతా కూడా పట్టేశావా? పరీక్షల్లో అయినా టెక్స్ట్‌బుక్స్ అంత ఏకాగ్రతగా చదివి ఉండవు అని భార్యను ఆటపట్టిస్తాడు. అతడెవడో అబద్ధాలు చెప్పడంతో దిట్టలా ఉన్నాడు అని అంటాడు. అబద్ధం ఏముందీ, రమ్య అందంగానే ఉంటుంది కదా అందుకే అలా రాశాడని చెబుతుంది.

పెళ్ళి చూపులు తతంగం ఉన్న గంటలోనే మనసులో భావాలను దివ్య దృష్టితో కనిపెట్టేసినట్లు మాట్లాడటం అబద్ధం కాక మరేమిటి అని ప్రశ్నిస్తాడు. అలా అబద్ధాలు వర్ణించటమే కవిత్వమైతే అది తనకి చేత కాదని అంటాడు. తనకి చిన్నప్పటి నుండి అబద్ధాలు చెప్పటం అలవాటు కాలేదు అని అంటాడు. భాస్కర్ మాటలను అరవింద వ్యతిరేకిస్తుంది. అందమైన పోలికలతో చెప్పడం అబద్ధం ఎలా అవుతుంది అని ప్రశ్నిస్తుంది. రమ్యని అదృష్టవంతురాలని ఎందుకన్నానో తెలుసా? అతను ఆస్థిపరుడు, ఉద్యోగస్తుడూ అయినందువల్ల కాదు. కేవలం అంత అందమైన ప్రేమలేఖలను అందుకోగలిగి ఆ అనుభూతి పొందుతున్నందువలనే అని అంటుంది. పెళ్ళికి ముందు అడిగి ఉంటే ఆనందంగా ఒప్పుకునే వాడిని అని అంటాడు భాస్కర్. పెళ్ళయ్యాక రాసుకుంటేనే క్షేమకరం, ఆరోగ్యకరం అని అంటుంది అరవింద. భాస్కర్‌కు ఆకలి వేసి ప్రేమలేఖ గోల ఆపి తిండి సంగతి చూడమంటాడు. తన ప్రేమలేఖ ముచ్చట తీరుస్తానని మాటివ్వమంటుంది అరవింద. ఏ పట్టుచీరో ముచ్చటపడి కావాలని అడిగితే, పరిగెత్తుకెళ్ళి తెచ్చేవాడిని కానీ ప్రేమలేఖ రాయడం తన వల్ల కాదని అంటాడు. పట్టు చీర అయితే నేను వెళ్ళి కొనుక్కోగలను, కాని ప్రేమలేఖ మీరే రాయాలి అని అంటుంది. వాగ్యుద్ధంలో ఓడిపోయి రాజీకీ వస్తాడు భాస్కర్. అవసరం

18. **తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 17**

వచ్చినప్పుడు రాస్తానని మాటిస్తాడు. మంచివారు మావారు అంటూ ఓ ముద్దు పెట్టి వడ్డించటానికి వంట గదిలోకి పరిగెడుతుంది అరవింద.

కొంతకాలం గడుస్తుంది. అరవింద మనసులో మొలకెత్తిన కోరిక రోజురోజుకి చిలవలు, పలవలూ వేసి మహా వృక్షమై కూర్చుంటుంది. అవకాశం ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురుచూస్తుంది. అమ్మగారిల్లు, అత్తవారిల్లు రెండూ వారిద్దరుండే ప్రాంతానికి దగ్గరిగానే ఉంటాయి. పదిరోజులుండే అవసరం ఎప్పుడు ఏర్పడలేదు. ప్రొద్దున వెళితే సాయంత్రానికి వచ్చేయవచ్చు. అందుకే అరవిందే ఒక అవకాశాన్ని కల్పించుకుంటుంది. అరవింద అన్నయ్యకి హైద్రాబాద్ ట్రాన్స్ఫర్ అవుతుంది. ఆమె వదిన మూడో నెల గర్భవతి. రెండేళ్ళ చంటి పాప కూడా ఉంటుంది. సామాను సర్దుకోవడానికి ఎవరైనా సాయంగా వెళితే బాగుంటుందని పెద్దవాళ్ళు అనుకుంటూ ఉంటే అరవింద తనే వెళ్తానని ప్రయాణమవుతుంది. భాస్కర్ వదన్నా, విసుక్కున్నా తన కోరిక తీరే అవకాశం దొరికిందనే ఉత్సాహంలో ఉంది కనుక వినిపించుకోదు. వారం తర్వాత ఎప్పుడు మీ ఉత్తరం అందితే అప్పుడే వచ్చేస్తాను, గుర్తు పెట్టుకోండి అని హెచ్చరిస్తూ బయలుదేరుతుంది. తనకి చేత కాదని చెప్పినా వినిపించుకోదు. మనసులో ప్రేమ ఉంటే మాటల్లోకి అదే వస్తుంది అని అంటుంది. నిన్ను విడిచి విరహంతో ఉండలేనని అంటాడు. విరహం కూడా సుఖమేనని అంటుంది అరవింద. చూపులతోనే చుంబించి హుషారుగా భర్త దగ్గర నుండి వీడ్కోలు తీసుకుంటుంది.

హైదరాబాద్లో వారం రోజులు హడావుడిగా గడిచిపోతాయి. ఆ తర్వాత రోజులు నెమ్మదిగా నత్తనడకన సాగుతున్నట్లు అనిపిస్తుంది అరవిందకు. రోజంతా భర్త దగ్గరి నుండి వచ్చే ప్రేమలేఖ కోసం ఎదురు చూడటం, ఏ విధంగా రాస్తాడోనని ఊహించడం. ఇదే దినచర్యగా మారుతుంది. తమ జీవితంలోని మధురస్మృతులను గుర్తు చేస్తూ... విరహవేదనని వెల్లడిస్తూ భాస్కర్ రాసే ప్రేమలేఖ కోసం ఆరాటంగా ఎదురుచూస్తు ఉంటుంది అరవింద. పదిరోజులు గడుస్తాయి. ఉత్తరం రాలేదు కాని ఆమె అత్తయ్య వస్తుంది. తనని తీసుకువెళ్ళడానికి వచ్చానని చెబుతుంది. ఆఫీసులో సెలవులు లేకపోవడంతో భాస్కర్ రాలేకపోయాడని అందుకే తనని పంపించాడని చెబుతుంది. విషయం వినగానే అరవింద ఒళ్లు మండుతుంది. తను కోరిన కోరిక కోసం ఈ ఎడబాటును కోరి తెచ్చుకుంటే, లక్ష్యం లేనట్లు తల్లిని పంపిస్తాడా? అని రానని నిష్కర్షగా చెబుతుంది. ఇక తప్పక ఉత్తరం రాస్తాడని ఎదురుచూడటం మొదలుపెడుతుంది.

అరవింద అంచనా నిజమవుతుంది. అత్తయ్య వెళ్ళిన మూడు రోజులకే ఉత్తరం వస్తుంది. ఎంతో ఆనందంతో ఆ ఉత్తరాన్ని అందుకుంటుంది. తీరిగ్గా చదువుకుంటానని గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకుని ఉత్తరం విప్పుతుంది. తాను ఎదురుచూసినట్లు, ఊహించినట్లు ఏం లేదు. "ఏయ్ మొద్దూ! నీకసలు బుద్ధుందా? నా సహనానికయినా ఓ హద్దంటూ ఉందని తెలుసా? అమ్మతో తిండికేం ఇబ్బంది లేదుగా అన్నావట! ఎవరైనా పెళ్లి చేసుకునేది తిండి కోసమా? తోడు కోసమా?.... ఇట్లు ప్రేమలేఖ కారణంగా అరవిందానికి దూరమై, విరహానికి గురైన మంద భాగ్యుడు - భాస్కరం."[19] అని ఆ ఉత్తరం సారాంశంగా ఉంటుంది. తను ఊహించినట్లు లేక, మొద్దూ అనే సంబోధనతో మొదలవ్వటం వలన ఉత్తరాన్ని ఓ మూలకి విసిరికొట్టి దుఃఖంతో దిండులో తలను దాచుకుంటుంది. ఉత్తరం భాస్కర్ దగ్గరి నుండేనా? రమ్మని రాశాడు అని ఆమె వదిన అడిగితే కోపంతో రమ్మని రాస్తే పరిగెట్టుకు వెళ్ళిపోవాలా? నేనసలు వెళ్ళను" అని అంటుంది. కోపం ఎవరి మీదనో అర్థం కాక ఆమె అక్కడి నుండి వెళ్ళిపోతుంది. తన కోపాన్ని తెలియజేయటం కోసమైనా వెళ్ళకుండా ఉండాలని నిశ్చయించుకుంటుంది. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ చల్లగాలికి బాల్కనిలోకి వచ్చి నిలబడుతుంది. రోడ్డు మీద అటుగా వెళ్ళే రమ్య కన్పిస్తుంది.

అరవింద ఆశ్చర్యంతో రమ్యను పిలుస్తుంది. తనపై ప్రశ్నల వర్షం కురిపిస్తుంది. రమ్య ఉద్యోగంలో చేరినట్లు చెబుతుంది. అదేమిటి? పెళ్ళి సంగతి ఏమైంది అని అడుగుతుంది. పెళ్ళి రద్దయిందని రమ్య అంటుంది. కట్నకానుకల వివాదాల వలన పెళ్ళిని రద్దు పరచుకోవాల్సి వచ్చిందని తెలియజేస్తుంది. అదేమిటి! అంత ఇష్టంగా ప్రేమలేఖలు రాశాడు. అతను తమ పెద్దలకు నచ్చచెప్పే ప్రయత్నం చేయలేదా అని అరవింద అంటుంది. అవి ప్రేమ లేఖలు కావు అతని భాషా పాండిత్యాన్ని ప్రదర్శించే ఉత్తరాలు మాత్రమే. మనసు లేని మాటలకు విలువ ఏం ఉంటుంది. తన పెద్ద వాళ్ళకి ఎదురుచెప్పలేనని చేతులెత్తేశాడని బాధతో చెబుతుంది రమ్య. అందుకే ఆ ఉత్తరాలను చింపేసి, వ్యాపకం కోసం ఉద్యోగంలో చేరాను. మావాళ్ళు మరలా వాళ్ళ పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారని విరక్తిగా నవ్వుతూ అంటుంది.

---

**19. తొలిచూపు కథా సంపుటి - గోగినేని మణి - పుట 20**

రమ్య మాటలు విన్న అరవింద ఒక్కసారిగా స్థాణువులా ఉండిపోతుంది. ఊహా లోకంలో విహరిస్తున్న తన రెక్కలను ఒక్కసారిగా ఎవరో కత్తిరిస్తే, దబ్బున నేల మీద పడినట్లు అనిపిస్తుంది. తాను చేసిన తప్పు తనకి తెలిసి వస్తుంది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా భర్త వద్దకు బయలుదేరుతుంది. విసిరేసిన ఉత్తరాన్ని తీసి సరిచేసి దాచుకుంటుంది. తను నిజంగా మొద్దేనని మురిపెంగా అనుకుంటుంది. తన భర్త రాసిన ఉత్తరంలో అందమైన భాష లేకపోయినా, తనపై అపారమైన ప్రేమ ఉంది అని భావిస్తుంది.

**విశ్లేషణ :**

ప్రేమలేఖ కథను రచయిత్రి చక్కటి హాస్యంతో నడిపించారు. కొత్తగా పెళ్ళైన దంపతుల ఆప్యాయతానురాగాలు భాస్కర్, అరవింద పాత్రలతో కళ్ళకు కట్టినట్టు చూపారు. ప్రేమ లేని ప్రేమలేఖలు రాయడం కంటే ప్రేమగా చూసుకునే వాడే దొరకటం అదృష్టం అని ఈ కథ ద్వారా తెలియజేశారు. చక్కటి హాస్యభరిత సంభాషణల ద్వారా, కవితాత్మక వ్యక్తీకరణ ద్వారా కథ ఆద్యంతం సహృదయ పాఠకుణ్ణి ఆకట్టుకుంటుంది. అరవింద తను చూచిన సంగతిని కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తుంటే భాస్కర్ వేళాకోళమాడతాడు. ఆ సందర్భంలో చక్కటి హాస్యాన్ని పండించారు రచయిత్రి. అరవింద తన భర్తతో మీకసలు రసహృదయం లేదు అని అంటుంది. అందుకు సమాధానంగా ఆమె భర్త భాస్కర్ చమత్కారంగా ఇలా అంటాడు. "ఎవరి హృదయంలోనైనా రక్తమే ఉంటుంది. రసం, సాంబారూ ఉండవ్! ఇంతకీ నీ ముఖారవిందం ముడుచుకుపోవటానికి గల కారణం శెలవియ్యి మహారాణి, చంపక!"[20] అని వేళాకోళమాడతాడు. అరవింద స్నేహితురాలు రమ్యకి కాబోయే భర్త ప్రేమలేఖ రాస్తాడు. ఆ లేఖను చదివిన అరవింద కూడా తన భర్తచేత ప్రేమలేఖ రాయించుకోవాలని ఆరాటపడుతుంది. పెళ్ళికి ముందు తనకి అటువంటి అనుభవాలు లేకపోవటం వలన బాధపడుతుంది. రమ్య ఇంటినుండి వచ్చిన వెంటనే భర్తతో ప్రేమలేఖ సంగతులన్నీ చెబుతుంది. ఈ సందర్భంలోని సన్నివేశమంతా అరవింద, భాస్కర్‌ల చమత్కార సంభాషణలతో నడిపించారు రచయిత్రి. అరవింద భర్తతో "మీరు ఓ ప్రేమలేఖ రాయాలి!" అని అంటుంది. భాస్కర్ తనకి చేతకాదంటాడు. "నువ్వే రాసి ఉంచితే జెరాక్స్ తీసి అవసరం అయినప్పుడు పోస్ట్ చేస్తా" అని భార్యను ఆటపట్టిస్తాడు. అరవింద భర్త మాటలకు కోపగించుకుంటుంది. ఇక తప్పేటట్లు లేదని భాస్కర్ అయిష్టంగానే సందర్భం వస్తే తప్పకుండా రాస్తానని మాటిస్తాడు.

---

20. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 16

భర్త దగ్గర నుండి ప్రేమలేఖ అందుకునే సువర్ణవకాశం ఎప్పుడొస్తుందానని ఎదురు చూస్తుంటుంది అరవింద. మనసులో మొలకెత్తిన కోరిక రోజులు గడిచేకొద్ది మహావృక్షంలా మారుతుంది. తానే అవసరాన్ని కల్పించుకుని తన అన్నయ్యకు ట్రాన్స్‌ఫర్ అయితే హైద్రాబాద్ ప్రయాణమవుతుంది. భాస్కర్ వద్దన్నా వినదు. తాను విరహ వేదనను అనుభవించలేను అంటాడు. మీరు ఉత్తరం రాసిన వెంటనే వస్తాను అని చెబుతుంది. తనకి చేతకాదని అంటాడు. ప్రేమ ఉంటే అదే చేతనవుతుందని అంటుంది. ఈ సన్నివేశంలో భాస్కర్ కోపంతో వ్యక్తీకరించిన కవితాత్మక వ్యక్తీకరణ రచయిత్రి వర్ణనా నిపుణతను తెలియజేస్తుంది.

"మనసులో ఉప్పొంగే ప్రేమని అక్షరాల బిందెలతో కాగితాలపై కుమ్మరించి ఓ గోతాంలో కుక్కి, పార్శిల్ లారిలో పంపిస్తాను."[21] అని అంటాడు. విరహం కూడా సుఖమే కదా అని ఒకకవి అన్నాడని అరవింద అంటే ఆ కవి ద్వంద్వార్థంలో అని ఉంటాడు. కాని తాను శ్రీరామచంద్రుడి లాంటివాడినని అంటాడు భాస్కర్. అదే తనకి గర్వకారణం అని అంటూ చూపులతోనే చుంబించి భర్త దగ్గర నుండి వీడ్కోలు తీసుకుని హైదరాబాద్ ప్రయాణమవుతుంది. ఇతరుల జీవితాలలో జరిగిన సంఘటనలను చూసి, అటువంటి సందర్భాలు తమ జీవితంలో కూడా జరిగి ఉంటే బాగుండేదని భావించే వ్యక్తులు నేటి సమాజంలో కోకొల్లలు. ఆ సంఘటనలు సాకారమవ్వాలని ప్రయత్నించి చివరికి తాను చేసింది తప్పని తెలుసుకుంది అరవింద. తన స్నేహితురాలు రమ్యకు ప్రేమలేఖ అందిన సందర్భం వేరు. ఆ ప్రేమలేఖ అందుకునే అనుభూతి తాను పొందలేదని ఎలాగైనా ఆ కోరికను తన భర్త ద్వారా నెరవేర్చుకోవాలని ప్రయత్నిస్తుంది. తన భర్తకు ప్రేమలేఖ రాయడం చేతకాదు. అంతమాత్రంచేత ప్రేమ లేదనికాదు. ఆమె అంటే అవ్యాజ్యమైన ప్రేమ. భార్య మనసుని నొప్పించని తత్త్వం. అందుకే ఆమె హైదరాబాద్ వెళ్ళిన తర్వాత ఉత్తరం రాస్తాడు. సంబోధనలోనే ప్రేమగా మొద్దూ! అని సంబోధిస్తూ రాస్తాడు. నీవు లేని జీవితం దుర్భరంగా ఉంది అని అంటాడు. నువ్వు వెంటనే రాకపోతే పిచ్చివాడి నవుతానని అంటాడు. ప్రేమలేఖ కారణంగా విరహానికి గురైన మందబాగ్యుడు అని రాస్తాడు.

భాస్కర్ రాసిన ఉత్తరం చదువుతుంది అరవింద. భర్త రాసిన ఉత్తరంలోని సంబోధన కాని విషయం కాని ఆమెను సంతృప్తిపరచవు. కన్నీటితో బాల్కనీలోకి వస్తుంది. అటుగా వెళ్తున్న తన స్నేహితురాలు రమ్య కన్పిస్తే పిలుస్తుంది. రమ్య జరిగిన విషయమంతా

---

21. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 18

చెబుతుంది. తనికి అందిన ప్రేమలేఖలలో ప్రేమ లేదని, భాషా పాండిత్యాన్ని ప్రదర్శించే ఉత్తరాలు మాత్రమేనని చెబుతుంది. కట్నకానుకల వివాదంవలన నిశ్చయమైన పెళ్ళి రద్దయినట్లు తెలియజేస్తుంది. అరవిందకు తాను చేసిన తప్పు తెలిసి వస్తుంది. అనవసరంగా తన భర్తను ఇబ్బంది పెట్టానని పశ్చాత్తాపపడుతుంది. తన భర్త రాసిన లేఖలో అందమైన వర్ణనలు లేకపోయినప్పటికి తనంటే అవ్యాజమైన ప్రేమ ఉందని తెలుసుకుంటుంది. వెంటనే భర్త దగ్గరకు బయలుదేరుతుంది. కథ యొక్క ముగింపును చాలా చక్కగా చిత్రించారు రచయిత్రి. చక్కటి సన్నివేశ కల్పన ద్వారా ముగింపు పలికారు.

"ఈ ఉత్తరంలో అందమైన భాష లేదు. అయితేనేం, ప్రేమ ఉంది. మనసు ఉంది... నా కోసం తపన ఉంది! నాకీ ప్రేమలేఖ చాలు! సూట్‌కేసులో ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా దాచుకుంటూ తృప్తిగా, ఆనందంగా అనుకుంది అరవింద. అలా అనుకోగానే ఆమె మనసులో అప్పుడు మొదలైంది మొగలిపూల గాలి ముత్యాల వాన!"[22] ఈ కథలో భార్యభర్తల విరహ ప్రణయం కన్పించి పాఠకుని ఆకట్టుకుంటుంది.

## 2.2.2 గెలుపు నాది :

ఈ కథలో ప్రధానపాత్రలైన మాధవ్, గీతల ప్రణయ గాధను తనదైన శైలిలో చక్కగా తెలియజేసారు రచయిత్రి. మాధవ్‌కు గీతతో పెళ్ళి జరుగుతుందా? లేదా? అనే సందేహంతో స్థిమితంగా ఉండలేడు. బయటి వాతావరణం ఎంత ఆహ్లాదకరంగా ఉన్నా అతను మనసు కల్లోల భరితంగానే ఉంటుంది. గీత తనకు రాసిన ఉత్తరాన్ని తీసి పదే పదే చదువుతుంటాడు. ఆ ఉత్తరం యొక్క సారాంశం ఏమిటంటే? గీత, మాధవ్‌ల పెళ్ళికి మాధవ్ తల్లి అంగీకారం లేదని, ఆ వార్త తనకి తెలిసినట్లు చెబుతుంది. పెద్దవాళ్ళను ఎదిరించి పెళ్ళి చేసుకోవడం గీతకు ఎంత మాత్రం సమ్మతంకాదని తెలియజేస్తుంది. జన్మనిచ్చి, ప్రేమానురాగాలతో పెంచి-పెద్ద చేసిన వాళ్లను పెళ్ళి విషయం వచ్చేసరికి ఎదిరించటం సమంజసం కాదని చెబుతుంది. అందరి ఆమోదంతో జరిగే పెళ్ళిలోనే పరిపూర్ణమైన ఆనందం కలుగుతుంది. తాను కోడలిగా వెళ్ళబోయే ఇంటిలో తన భర్త మాత్రమే కాదు, ఆ ఇంటిలో అందరూ తనని ఆదరంగా చూసుకోవాలి అని భావిస్తున్నానని ఈ విషయం తెలియజేయటానికే ఉత్తరం రాస్తుంది. గీత తాను తీసుకున్న ఈ నిర్ణయానికి ఎంతగానో బాధపడుతుంది. తన మనసును గట్టి పరచుకోవడానికి తన సర్వశక్తుల్ని కూడదీసుకుంటుంది.

22. తొలిచూపు కథా సంపుటి - గోగినేని మణి - పుట 21

గీత, మాధవ్‌లు వరుసకు బావ, మరదళ్ళు కావటం చేత ఇద్దరూ ఎంతో చనువుగా మెలగుతారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటారు. ఆ స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ మాధవ్ తల్లికి ఇష్టం లేకపోవడం వలన గీత కఠిన నిర్ణయం తీసుకోవడానికి సిద్ధపడుతుంది. మాధవ్‌తో నెరపిన ప్రేమవ్యవహారం మరచిపోవటానికి తన మనస్సును, దృష్టిని చదువు మీదకు మళ్ళిస్తున్నట్లు ఉత్తరం ద్వారా మాధవ్‌కు తెలియజేస్తుంది.

ఉత్తరాన్ని చదవడం ముగించిన మాధవ్ పాత జ్ఞాపకాలన్నీ నెమరు వేసుకుంటాడు. ఇక్కడ తల్లితో జరిగిన గొడవను తన దూరపుబంధువు రామ్మూర్తి బాబాయి చేరవేసి ఉంటాడని భావిస్తాడు. ఆ ఉత్తరాన్ని చదువుతున్న కొడుకును అటుఇటు తిరుగుతూ గమనిస్తూ ఉంటుంది దుర్గాంబ. ఉండబట్టలేక ఉత్తరం ఎక్కడిదని అడుగుతుంది. మాధవ్ సమాధానంగా మీ పుట్టింటి నుండి అని తెలియజేస్తాడు. ఆ మాటతో దుర్గాంబ ఆతురత మరింత పెరిగిపోతుంది. ఏం వ్రాశారని అడుగుతుంది. రామ్మూర్తి బాబాయ్ వెళ్ళి ఇక్కడ జరిగినదంతా అక్కడకు తెలియజేసినట్లు ఉంది. అందుకే మన సంబంధం వారికి అవసరం లేదని రాశారని తెలియజేస్తాడు భాస్కర్. దుర్గాంబ లోలోపల సంతోషపడుతుంది. అంతా మన మంచికే జరిగిందని కొడుకుతో చెబుతూ జగన్నాథం గారి అమ్మాయిని చూసావంటే, ఆ అమ్మాయిని తప్ప మరెవ్వరినీ చేసుకోనంటావు అని చెబుతుంది. తల్లి మాటలకు మనసులోనే బాధపడతాడు భాస్కర్. గతాన్ని మరొక్కసారి నెమరువేసుకుంటాడు. ఒకసారి పని మీద విజయవాడ వెళతాడు. అక్కడ స్టేషన్ దిగిన బాస్కర్‌ను చూసిన అతని మేనమామ బలరామయ్య తన ఇంటికి తీసుకొని వెళతాడు. సుమారు పది రోజుల పాటు అక్కడ ఉండాల్సి వస్తుంది. మామయ్య బలవంతం పెట్టేసరికి వాళ్ళింట్లోనే ఉంటాడు. బలరామయ్య దుర్గాంబలు స్వంత అన్నాచెల్లెళ్ళు అయినా రాకపోకలు ఇరు కుటుంబాల మధ్య తక్కువే. మాధవ్ అంతకు ఐదారాళ్ళ క్రితమే తన మరదలైన, బలరామయ్య కూతురు గీతను బంధువుల పెళ్ళిలో చూస్తాడు. పది రోజులు అక్కడ ఉండేసరికి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించి ప్రణయంగా మారుతుంది. ఆ విషయమే భాస్కర్ తల్లితో చెబితే కోపంతో మండిపడుతుంది. అన్నయ్య కూతురిని చేసుకుంటే కట్నం అడిగలేనని ఆమె దురాశగా ఉంటుంది. ఆమె కట్నకానుకలిచ్చే జగన్నాథం కూతురిని కోడలిగా తీసుకురావాలని అనుకుంటుంది. అన్న బలరామయ్యకు పెద్దగా ఆస్తిపాస్తులేవి ఉండకపోవడం చేత గీతను కోడలిగా చేసుకోవడానికి అంగీకరించదు.

గీత రాసిన ఉత్తరాన్ని తలచుకుంటూ మాధవ్ గదిలో నిర్లిప్తంగా పడుకొని శూన్యం

వైపు చూస్తూ పరిపరివిధాలుగా ఆలోచిస్తూ ఉంటాడు. బలరామయ్య దగ్గర ముందుగా తనే పెళ్ళి ప్రస్తావన తెస్తాడు. అంతా సవ్యంగా జరుగుతుంది అని అనుకుంటాడు. గీత రూపం, ప్రవర్తన అతనికెంతో నచ్చుతాయి. గీత భార్యగా వస్తే అది తనకో వరమేనని భావిస్తాడు. విజయవాడలో మామయ్యఇంట్లో ఉన్న పదిరోజులు గీతతో భాస్కర్ బంధం విడదీయరానిదిగా మారుతుంది. ఒక రోజు సాయంత్రం డాబా మీద భాస్కర్ తిరుగుతూంటే కాఫీ తీసుకుని గీత వస్తుంది. గీత ఆరోజు ప్రత్యేకంగా ముస్తాబైనట్లుగా కనిపిస్తుంది. గులాబీ పువ్వులున్న తెల్లని షిఫాన్ చీర, తెల్ల జాకెట్టు వేసుకుని, తలంటు పోసుకున్న జుట్టుకు రబ్బరు బ్యాండ్ వేసి వదులుగా వదిలేస్తుంది. ఆ సాయంకాలపు నీరెండలో గీత మేను ఛాయ మరింతగా మెరసిపోతుంది. కాఫీ తాగుతూ భాస్కర్ గీతను తదేకంగా తన్మయత్వంతో చూస్తాడు. గీత భాస్కర్ చూపులను గమనించి చిరుకోపంతో ఉన్నట్లు నటిస్తూ ఏయ్ బావా? ఏమిటా చూపు మార్చు అని అంటుంది. భాస్కర్ ఆమెను కవిత్వంతో ముంచెత్తుతాడు. గీత మృదుమధురంగా నవ్వుతుంది. తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తాడు భాస్కర్. గీత అంగీకారం కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. గీత మౌనంగా అలా ఉండిపోతుంది. ఈ ఆనంద సమయాన్ని ఇద్దరూ సంబరంగా జరుపుకోవాలి అని అంటాడు భాస్కర్. చొరవగా గీత చేయిని తీసుకుని అరచేతి నుండి మోచేతి వరకు వరసగా త్వరత్వరగా చుంబిస్తాడు. గీత భాస్కర్ ప్రవర్తనకు ముందుగా బిత్తరపోతుంది. ఆ తర్వాత తేరుకుని చిరుకోపంతో భాస్కర్‌ను విడిపించుకొని కొంచెం దూరం జరుగుతుంది. భాస్కర్‌ని చాలా దూరం వెళ్తున్నానవని సున్నితంగా హెచ్చరిస్తుంది. భాస్కర్ తమాషాగా దూరమెక్కడికి వెళ్ళను మధ్యలోనే ఆగిపోయానుగా అంటాడు. పెదవులపైకి వస్తున్న నవ్వును ఆపేస్తూ కట్నం సమస్య రాదంటావా అని అంటుంది. ఆ సమస్యే వస్తే చిన్నప్పుడు తాను చదువుకున్నప్పుడు నవ్వితే నవరత్నాలు రాలే రాకుమారి మళ్ళీ గీతగా జన్మించిందని చెబుతాను అని అంటాడు. ఆమె నవ్వితే నవరత్నాల పంట పండుతుందని తెలియజేస్తాను అని అంటాడు. మనసైన అమ్మాయి చిరునవ్వులే నిజమైన సిరులు మగవాడికి అని అంటాడు.

భాస్కర్ అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకుంటాడు. మరునాటి నుండి మామూలుగానే కన్పిస్తాడు. దుర్గాంబ కూడా గండం గడిచింది అని అనుకుంటుంది. రెండు నెలల తర్వాత ఒకనాడు భాస్కర్ ఆఫీసునుండి వస్తూ అత్యవసరమైన పని మీద ఊరు వెళుతన్నానని తల్లితో చెప్పి బయలుదేరుతాడు. తను వెళ్ళిన కాసేపటికే ఓ పదేళ్ళ అబ్బాయి వచ్చి మాధవగారున్నారా! అని దుర్గాంబను అడుగుతాడు. ఎందుకు, ఏమిటి అని దుర్గాంబ పదే పదే అడగ్గా ఆ అబ్బాయి నక్కుతూ ఆఫీసుకు వెళితే ఇంటికి వెళ్ళారన్నారని,

అందుకే ఇంటికి వచ్చానని చెబుతాడు. తన చేతిలో ఉన్న కవరు అతనికి తప్ప వేరే ఇంకెవరికి ఇవ్వొద్దని అక్క చెప్పిదని చెబుతాడు. మరేం ఫర్వాలేదు. నే ఇస్తాలే అంటూ లాక్కుని కవరుని తెరచి చదువుతుంది. భాస్కర్ వేరే కులం అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు అందులో సారాంశంగా ఉండడం చూసి నిర్ఘాంతపోతుంది. రెండు క్షణాలు ఆలోచించి వెంటనే విజయవాడ బయలుదేరుతుంది. అక్కడ తన అన్నయ్య బలరామయ్యను కలిసి గీతను మాధవ్‌కిచ్చి పెళ్ళి చేయాలని పట్టుపడుతుంది. వెంటనే పెళ్ళి కూడా జరిపించేస్తుంది. పెళ్ళైన కొద్ది రోజుల తర్వాత మాధవ్ గీతకు జరిగినదంతా వివరిస్తాడు. ఏమాత్రం కట్నం ఇవ్వలేని, బరువు బాధ్యతలు, మతాంతరం ఇవన్నీ ఉన్న ఒకపాత్రను రంగంలోకి దించి నాటకమాడాను. వెంటనే అమ్మ పెళ్ళికి ఒప్పుకుంది అని తెలియజేస్తాడు. మాధవ్ తాను కోరుకున్న అమ్మాయిని ఉపాయంతో గెలుచుకున్నానని అంటాడు. కానీ నిజానికి తాను ఆడింది నాటకమని తల్లికి తెలుసు. అతడి మనసులో గీత తప్ప వేరెవ్వరు లేరని దుర్గాంబ తెలుసుకుని వివాహం చేస్తుంది. గీత మేరి సంగతి అబద్ధమని దుర్గాంబతో చెబుతున్నప్పుడు ఆ సంగతి తనకి తెలుసునని చెబుతుంది. అత్తా, భర్తల మనసును గెలుచుకున్న గీత నిజమైన గెలుపు తనదేనని సంతోషిస్తుంది.

**విశ్లేషణ :**

చక్కటి కథా సమన్వయంతో పాఠకుడు ఊహించని మలుపు తిప్పుతూ కథనాన్ని నడిపించారు రచయిత్రి. ఈ కథలో ప్రేమ, ప్రణయం, ఆప్యాయతానురాగాలు, అనుబంధాలు వంటి ఎన్నో విషయాలు మేళవింపుగా కథను తీర్చిదిద్దారు. మాధవ్ మేనమామ కూతురు గీత రూపం, గుణాలు నచ్చి ప్రేమిస్తాడు. తాను ప్రేమించిన విషయం తల్లి దుర్గాంబతో చెబుతాడు. దుర్గాంబ ధనంమీద వ్యామోహం ఉన్న వ్యక్తి కావడంచేత ఆ ప్రేమను నిరాకరిస్తుంది. తన కుమారుడికి గొప్పింటి సంబంధం చేస్తే అధికంగా కట్నకానుకలు వస్తాయని ఆశ పడుతుంది. తన తల్లి మనసును మార్చటానికి మాధవ్ వేరొక కులం అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నట్లు నాటకమాడతాడు. దుర్గాంబ తన కొడుకు మాధవ్ గీతను మరిచిపోలేక ఈ నాటకమాడుతున్నట్లు తెలుసుకుని మాధవ్, గీతలు పెళ్ళి చేస్తుంది. మాధవ్ తన నాటకం వల్లే పెళ్ళి జరిగిందని భావిస్తాడు. తన ప్రేమతో గెలుపును సాధించడానికి కారణం తానేనని అనుకుంటాడు. కాని ఆ నాటకం గురించి తనకి తెలుసని దుర్గాంబ గీతతో చెబుతుంది. గీత, మాధవ్ ప్రేమ గెలుపు కారణం తనేనని చెబుతుంది. కాని మాధవ్, దుర్గాంబల మనసు గెలుచుకున్న తనదే నిజమైన గెలుపని గీత అంటుంది.

ఈ కథలో ప్రతి పాత్ర ఆదర్శవంతమైనదే. పెద్దల మనసు నొప్పించి పెళ్ళి చేసుకోవడం కంటే వాళ్ళని ఒప్పించి చేసుకోవడమే ఉత్తమమని భావిస్తారు మాధవ్, గీతలు. పిల్లల మనసును అర్థం చేసుకుని వారి ప్రేమకు అంగీకరిస్తారు దుర్గాంబ, బలరామయ్యలు. కథలో దుర్గాంబ పాత్ర ధన వ్యామోహం గల పాత్రగా తీర్చిదిద్దినప్పటికి కథాంతంలో ఆమెను ఒక ఉన్నత స్థానంలో ఉంచుతారు రచయిత్రి.

ఇవి ప్రణయ సంబంధమైన కథగా తీసుకోవడానికి ప్రధాన కారణం గీత, మాధవ్‌ల ఏకాంత సన్నివేశం. ఎక్కడా అశ్లీలత ద్యోతకం కాకుండా ఆ సన్నివేశాన్ని చక్కగా నడిపించారు రచయిత్రి.

"ఏదీ నీ చెయ్యి ఇలా ఇవ్వు. నీకొకటి ఇస్తాను" అంటూ చొరవగా గీత చేయి అందుకుని అరచేతి నుండి మోచేతి వరకు వరసగా చుంబించాడు త్వరత్వరగా!

ముందు బిత్తరపోయి, ఆ తరువాత గీత చిరుకోపంతో చేతిని లాక్కుని కొంచెం దూరం జరిగింది. "బావా నువ్వు చాలా దూరం వెళ్తున్నావు" అంది.

"దూరమెక్కడ? మధ్యలోనే ఆగిపోయానుగా! లేకపోతే ఆ రూటులోనే అలా అలా చెక్కిలి వరకూ వెళ్ళిపోయేవాడిని తెలుసా?"[23] తమాషా నవ్వేస్తూ అన్నాడు.

## 2.2.3 కానుక :

ఈ కథలో ప్రధాన పాత్రలు సీత, శరత్‌లు భార్యాభర్తలు. ఆఫీసు నుండి వచ్చిన శరత్‌కు సీత అలంకరణ చూసి కొత్తగా అనిపించింది. ఆమెను తదేకంగా చూస్తాడు. ఏమిటిలా చేస్తున్నారని సీత భర్తను అడుగుతుంది. శరత్ అందమైన కవిత రూపంలో తన భావాన్ని తెలియజేస్తాడు.

**"పెదవులపై చిరునవ్వుల పువ్వులు,**
**కురులలో సిరిమల్లెల చిరునవ్వులు"**[24]

శరత్ వ్యక్తీకరణకు నవ్వుతూ పెదవులపై పువ్వులేమిటి... జడలో నవ్వులేమిటి... తారుమారుగా అంటుంది సీత. శరత్ సీతను నండూరి "ఎంకి"తో పోలుస్తాడు. ఆమె తమ ఊరి ప్రెసిడెంటు నండూరి రామబ్రహ్మం మనుమరాలు వెంకటలక్ష్మి (ఎంకి)తో

**23. మనసునమల్లెలు కథా సంపుటి - గోగినేని మణి - పుట 70**

**24. మనసునమల్లెలు కథా సంపుటి - గోగినేని మణి - పుట 107**

పోల్చుతున్నాడేమో అనుకుని అపార్థం చేసుకుంటుంది. ఆమె అమాయకత్వానికి శరత్ నవ్వి నండూరి సుబ్బారావు "ఎంకి" పాటలు గురించి తెలియజేస్తాడు.

శరత్‌కి ఉద్యోగం వచ్చిన నెలలోనే సీతతో పెళ్ళవుతుంది. సీత పల్లెలో పెరిగిన అమ్మాయి. చదువు పట్ల పెద్దగా ఆసక్తి లేకపోవటంతో ఏడవ తరగతితోనే విద్యాభ్యాసం ముగుస్తుంది. చదువు లేకపోయినా ఆమె అందం శరత్‌ని ఆకట్టుకుంటుంది. సీత ఇంటిని శుభ్రంగా ఉంచే తీరు శరత్ తల్లికి నచ్చి ఆమెను మెచ్చుకుంటుంది. శరత్ చెల్లెలు ఉషకి ఆరోగ్యం బాగా లేకపోవడం వలన అతని తల్లి కూతురు ఆరోగ్యం కుదుటపడేంత వరకు అక్కడ ఉండాలని నిశ్చయించుకుని వెళుతుంది. సీత అప్పటికి ఐదవ నెల గర్భిణి. ఇంట్లో ఒంటరిగా కాలక్షేపం కాక ఇంటిని తన అభిరుచి ప్రకారం సర్దే పనిలో నిమగ్నమవుతుంది.

శరత్ పుస్తకాల గదిని శుభ్రం చేసే పనిలో భాగంగా అతని బీరువాలలో ఉండే పుస్తకాలను తీసి పాత పేపర్లు, పుస్తకాలు కొనేవాడికి అమ్మేస్తుంది. విషయం తెలిసిన శరత్ సీతమీద తన కోపాన్ని ప్రదర్శిస్తాడు. ఆ గ్రంథాల గొప్పతనాన్ని వివరిస్తూ ఆగ్రహంతో ఊగిపోతాడు. తాను చదువుకునే రోజుల్లో మంచి మార్కులు వస్తే తనకి బహుమతిగా వచ్చిన వాటిని ఒక నిధిగా భావించి దాచుకున్నాను అని అంటాడు. ఆ పుస్తకాలు తన తర్వాతి తరానికి కానుకగా ఇచ్చి ఆ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవాలని అని అనుకున్నానని తెలియజేస్తాడు. పల్లెటూరి మొద్దు... మూర్ఖురాలు అని పరిపరి విధాలుగా తిడతాడు. సీత కళ్ళల్లో నీళ్లు తిరుగుతుంటే అక్కడి నుండి లేచి వెళ్ళిపోతుంది. శరత్, సీతలు చాలా సేపు మౌనంగా ఉండిపోతారు.

సీత అన్నయ్య మోహన్ సీతను చూడటానికి రావటంతో ఇద్దరూ మామూలుగా కనిపించటానికి ప్రయత్నం చేస్తారు. కానీ మోహన్ మామూలుగా లేరని గ్రహించి కారణం అడుగుతాడు. సీతను తనతో పాటు పుట్టింటికి తీసుకువెళతాడు. రోజులు గడిచే కొద్ది శరత్ కోపం తగ్గుతుంది. సీత క్షేమ సమాచారం తెలుసుకోవడానికి ఫోన్ చేస్తాడు. ఆమె మనస్ఫూర్తిగా మాట్లాడటం లేదని తెలుసుకుని బాబు పుట్టాక చూడటానికి వెళతాడు. అప్పటికీ ముక్తసరిగానే మాట్లాడుతుంది. బాబుకు మూడవ నెల వచ్చాక అత్తారింటికి వస్తుంది. ఆఫీసు నుండి వచ్చిన శరత్‌కి నవ్వుతూ ఎదురొస్తుంది. సీత మామూలుగా కనిపించేసరికి శరత్‌కు చాలా ఆనందంగా అనిపిస్తుంది. తనకో కానుక తెచ్చానని చెబుతుంది. శరత్ పుస్తకాల గది వైపు తీసుకొని వెళ్ళి అందంగా సర్దిన తన పుస్తకాలను చూపిస్తుంది.

ఆశ్చర్యంతో కూడిన ఆనందంతో ఇదెలా సాధ్యమైందని సీతని అడుగుతాడు. తాను పుస్తకాలను అమ్మిన విషయాన్ని అన్నయ్యతో చెబితే తానుకూడా మందలించాడని తెలియజేస్తుంది.

అన్నయ్య ఆ పుస్తకాల విలువను వివరించేసరికి తన తప్పును తెలుసుకున్నాను అంటుంది. తను చేసిన తప్పును సరిదిద్దటానికి ఆ పుస్తకాలు కొన్న వ్యక్తి ఇల్లు కనుక్కుని వాటిని తిరిగి తీసుకుని బైండింగ్ చేయించి తెచ్చానని తెలియజేస్తుంది. సీత పుస్తకాలు అమ్మేసిందని తెలిసినప్పుడు ఎంతటి ఆగ్రహావేశాలతో రగిలిపోయాడో... అంతకు రెట్టింపు పశ్చాత్తాపంతో బాధపడతాడు. పుస్తకాల కోసం జీవితాన్ని పంచుకోవడానికి వచ్చిన బాగస్వామి మనసును గాయపరిచానని తన తప్పు తెలుసుకుంటాడు. అది ఆమె అమాయకత్వంతో చేసిన తప్పే కానీ అహంకారంతో చేసింది కాదని అనుకుంటాడు.

తన మనసులోని భావాన్ని మాటల్లో తెలపకుండా క్షమాపణ కోరుతున్నవాడిలా సీత రెండు చేతులను తన చేతుల్లోకి తీసుకుని ఎంతో ఆర్తిగా, ప్రేమగా చుంబిస్తాడు. ఇద్దరూ కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోతారు. సీత ప్రసవానికి పుట్టింటికి వెళ్ళిన సమయంలో ఆ పుస్తకాలన్నీ తాను చదివానని చెబుతుంది. తన భర్త భావితరాలకు ఇచ్చే కానుకకు తనవంతు సహాయం చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నానని తెలియజేస్తుంది. ఆ పుస్తకాలను చదవడం వల్ల తన ఆలోచనా పరిధి పెరిగినట్లు, తన అభిప్రాయాల్ని, ఆలోచనల్ని సరిగ్గా చెప్పగలిగే భాష కూడా అలవడిందని వివరిస్తుంది. ఆమె మాటలకు ఉప్పొంగిపోయిన శరత్ భగవంతుడు ఇచ్చిన అపురూపమైన కానుకగా సీతను భావిస్తాడు.

**సమీక్ష :**

గోగినేనిమణి కలం నుంచి జాలువారిన మరొక అద్భుతమైన కథ కానుక. భార్యాభర్తల మధ్య ప్రణయాన్ని వివరిస్తూనే దంపతులు మధ్య అపోహ ఏర్పడితే అది ఒక అగాధంగా మారుతుందని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేసారు రచయిత్రి. సీత పాత్రలోని అమాయకత్వం ఆ అమాయకత్వం వలన చేసిన పొరపాటు పాఠకుణ్ణి ఆలోచింపచేస్తాయి. సీత అందమైన రూపాన్ని చూసి ఆమెకు పెద్దగా చదువు లేకపోయినా పెళ్ళి చేసుకుంటాడు శరత్. సీత ఇంటిని శుభ్రం చేసే ఉద్దేశ్యంతో శరత్ భద్రంగా దాచిన పాత పుస్తకాలను అమ్మేస్తుంది. ఆమెకు ఆ పుస్తకాల విలువ తెలియదని ఆగ్రహావేశాలతో ఊగిపోతాడు. ఆ సమయంలో పుస్తకాల గొప్పతనాన్ని శరత్ పాత్ర ద్వారా తెలియజేస్తారు రచయిత్రి.

"పుస్తకాలంటే ఏమిటో నీకు తెలుసా...! అవి వెలుగు బాటలూ... పూలతోటలూ!! ఒక గొప్ప గ్రంథం మనకొక గమ్యాన్ని, లక్ష్యాన్ని చూపించగలుగుతుంది."[25] సీతకి తాను చేసిన తప్పు అర్థం కాక శరత్ అన్న మాటలకు బాధపడి అతనితో మాట్లాడటం మానేస్తుంది. పుట్టింటికి వచ్చిన తర్వాత సీత అన్న మోహన్ తాను ఎంత పెద్ద తప్పు చేసిందో వివరిస్తాడు. అప్పుడు తాను చేసిన తప్పును సరిదిద్దాలని అనుకుంటుంది. తనకి బాబు పుట్టిన తర్వాత పుట్టింటివారు ఎటువంటి సంబరాలు చేయకుండా ఆ డబ్బు తనకే ఇచ్చేయమని అంటుంది. ఆ డబ్బుతో శరత్‌కు ఇష్టమైన పుస్తకాలను కొంటుంది. ఆ పుస్తకాలను తీసుకొని వెళ్ళి శరత్ పుస్తకాల గదిలో అందంగా సర్ధుతుంది. శరత్ ఆఫీసు నుండి రాగానే చిరునవ్వుతో ఆ గదిలోకి తీసుకొని వెళుతుంది. వాటిని చూసిన శరత్ ఆనందానికి అవధులు ఉండవు. ఊహించని కానుక భార్య దగ్గరినుండి లభించేసరికి అతనికి ఏం మాట్లాడాలో తోచదు.

ఇదే సందర్భంలో సీత శరత్‌తో ఇలా అంటుంది.

"పుస్తకాలు జీవితంలో విలువైన, ముఖ్యమైన భాగం మాత్రమే కదా! కానీ... నేను... మీతో జీవితం పంచుకోవటానికి వచ్చినదాన్ని. అమాయకత్వంతో చేసిన తప్పుకు... మనసు గాయపడేంతగా అలా మాట్లాడతారా...?!"[26] ఈ మాటలు సహృదయ పాఠకుని ఆలోచింపచేస్తాయి. మనల్ని నమ్ముకుని వచ్చిన వ్యక్తిని అర్థం చేసుకోకుండా క్షణికావేశంలో కోపాన్ని ప్రదర్శించడం వారి మనసు ఎంతగా గాయపడుతుందో తెలియజేసారు.

సీత మాటలు విన్న శరత్ పశ్చాత్తాపం భావంతో సిగ్గుపడతాడు. తాను చేసిన తప్పు తెలుసుకుంటాడు. అమాయకత్వంతో చేసిన తప్పుకానీ అహంకారంతో చేసింది కాదని తెలుసుకుంటాడు. తన మనసులోని భావాన్ని మాటల్లో చెప్పలేక, క్షమాపణ కోరుతున్న వాడిలా సీత వెంట అరచేతులను తన చేతుల్లోకి తీసుకుని ఎంతో ఆర్తిగా, ప్రేమగా చుంబిస్తాడు. కథాంతంలో రచయిత్రి పుస్తకాల గొప్పతనాన్ని సీత పాత్ర ద్వారా తెలియజేస్తూ ఇలా అంటారు.

"పుస్తకాలను చదవటం వల్లే నా ఆలోచనా పరిధి పెరిగినట్లు... ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లు అనిపించింది. ఇలా నాఅభిప్రాయాల్నీ, ఆలోచనల్నీ సరిగా

---

**25. మనసునమల్లెలు కథా సంపుటి - గోగినేని మణి - పుట 110**

**26. మనసునమల్లెలు కథా సంపుటి - గోగినేని మణి - పుట 113**

చెప్పగలిగే భాష కూడా అలవడిందిగా..."[27] మంచి పుస్తకాలను చదవటం వలన వ్యక్తి యొక్క ఆలోచనా పరిధి పెరుగుతుంది. తన అభిప్రాయాలు, ఆలోచనలను ఇతరులకు వ్యక్తపరచటంలో ఎంతగానో సహకరిస్తుంది. నిరంతర పుస్తక పఠనం వలన మన మేధోసంపత్తిని పెంచుకోవచ్చని ఈ కథ ద్వారా తెలియజేసారు రచయిత్రి. శరత్‌కు కానుకగా సీత పుస్తకాలను ఇస్తుంది. కానీ భగవంతుడిచ్చిన నిజమైన కానుక సీతేనని శరత్ ఆనందపారవశ్యంతో అంటాడు. భార్యభర్తల మధ్య ఒకరికొకరు అర్థం చేసుకునే గుణం ఉంది. ఆ బంధం కలకాలం నిలిచి ఉంటుందని శరత్, సీత పాత్రల ద్వారా తెలియజేసారు రచయిత్రి.

## 2.2.4 అభిమాని :

ఈ కథలో ప్రధాన పాత్రలు సురేఖ, రవిచంద్రలు. కథ ప్రారంభంలో రవిచంద్ర రేఖా, రేఖా అని పిలుస్తూ సురేఖ దగ్గరకు వస్తాడు. రవిచంద్ర ఆనందంగా ఉన్నట్లు గమనించిన సురేఖ సంగతేంటి? అని అడుగుతుంది. తన ఆనందానికి కారణం తాను రాసిన కథను మెచ్చుకుంటూ ఒక అభిమాని రాసిన ఉత్తరం అని తెలియజేస్తాడు. ఆ ఉత్తరం రాసింది కూడా యుక్తవయస్సులో ఉన్న అమ్మాయి అని తెలియజేస్తాడు. రవిచంద్ర, సురేఖలు స్నేహితులు. రవిచంద్ర ప్రతి విషయాన్ని సురేఖతో పంచుకుంటుంటాడు. రవిచంద్ర వర్ధమాన రచయిత. తన తొలి కథ ప్రచురితమైన మూడు నెలల తర్వాత ఒక అభిమాని నుండి తనని మెచ్చుకుంటూ ఓ ఉత్తరం వస్తుంది. ఆ ఆనందం పట్టలేక సురేఖ దగ్గరకు పరిగెత్తుకుంటూ కేకలు వేసుకుంటూ వస్తాడు. అందుకు కారణం కథ ప్రచురితమైన వెంటనే సురేఖ అభిప్రాయం తెలియజేయమంటే అభినందించకుండా విమర్శిస్తుంది.

రవిచంద్ర రాసిన కథ క్లుప్తంగా ఈ విధంగా ఉంటుంది. కథానాయకుడు అమర్ ప్రముఖ గాయకుడు. ప్రేమలత అనే అమ్మాయికి అమర్ అన్నా, అతని పాటలన్నా పిచ్చి అభిమానం! ఆమె ఒక పత్రిక ఆఫీసులో పని చేస్తుంటుంది. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉంటారు. ఒకసారి వృత్తిరీత్యా అమర్‌ని ఇంటర్వ్యూ చేసే అవకాశం రావడంతో ఆమెకి అమర్‌తో పరిచయం ఏర్పడుతుంది. అమర్ భార్య యాక్సిడెంట్‌లో చనిపోవడం వలన ప్రేమలత అమర్‌కు మరింత దగ్గరవుతుంది. తన ప్రేమాభిమానాల గురించి అమర్‌కు తెలియజేస్తుంది. ప్రేమలతకు పెళ్ళయిన భర్త స్పర్శను భరించలేక శరీరం మీద పెట్టుకున్న

---

27. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 113

వాతల సంగతి... అమర్‌తో విపులంగా తెలియజేస్తుంది. ఆమె ప్రేమకి చలించిపోయిన అమర్ ప్రేమలతను భార్యగా స్వీకరిస్తాడు.

కథ విన్న సురేఖ "అస్సలు నచ్చలేదు" అని నిర్మొహమాటంగా చెబుతుంది. పైపెచ్చు ఈ విధంగా విమర్శిస్తుంది.

"నీ కథలో నువ్వు వర్ణించినట్లుగా ప్రేమలతది అమర ప్రేమగాను కనిపించలేదు. కేవలం అవకాశవాదంగా మాత్రమే అనిపించింది. ప్రేమలతకి భర్తతో సమస్యలుగానీ, ఇబ్బందులు గానీ ఉన్నట్లు చెప్పలేదు. అంటే.. తనకంటే పైఅంతస్తులో ఉన్న అమర్‌తో పరిచయం కలిగి పెళ్ళికి అవకాశం రాగానే... తన భర్తనీ, పిల్లల్ని వదిలిపెట్టేయగలిగింది. ఏమైనా సమస్యలుండి విడాకులు తీసుకోవడం సమర్థనీయం కానీ మరొకరితో ప్రేమలో పడి విడాకులు తీసుకోవడం అంటే... నిరపరాధి అయిన జీవిత భాగస్వామిని నిస్కారణంగా శిక్షించినట్లేగా అది నేరం. ప్రేమ అనేది ఎప్పుడైనా, ఎవరి పట్లైనా అసంకల్పితంగా కలగొచ్చు అనే మాట నిజమే అయినా పెళ్ళయిన వాళ్ళు ఆకర్షణలనీ, మనసు చేసేగారడీనే ఎదుర్కొని వివాహ బంధాన్ని గౌరవించి స్థైర్యంగా నిలబడాలి"[28] అని తెలియజేస్తుంది. నీ కథ చదివిన పాఠకులకు నువ్వు తప్పుదారిన పట్టించిన వాడవుతావు అని తెలియజేస్తుంది. సందేశం ఇవ్వకపోయినా ఫర్వాలేదు కానీ తప్పుదారిని పట్టించడం మంచి పద్ధతి కాదని అంటుంది. సురేఖ మాటలకు మధ్యలో అడ్డం వచ్చి, రెండు చేతులు ఎత్తి దండం పెట్టి ఇక ఆపేయ్ అంటాడు రవిచంద్ర. కొద్ది రోజులు గడిచిన తర్వాత ఇంకేమైనా కథలు రాశావా? అని ప్రశ్నిస్తుంది సురేఖ. అందుకు సమాధానంగా రవిచంద్ర లేదని అంటాడు. అందుకు కారణం కూడా వివరిస్తాడు. ప్రచురితమైన తన తొలికథకు పాఠకుల దగ్గరనుండి స్పందన రాలేదని తనకథ ఎవరికీ నచ్చని కారణంగా ఇంక తాను కథలు రాయదలచుకోలేదని నిర్లిప్తంగా అంటాడు.

"ఇంత ఆంధ్రదేశంలో... ఉత్తరం రాయాలనిపించేంతగా స్పందనని నా కథ ఏ ఒక్కరికయినా కలిగించలేదంటే, నేను రచయితగా ఫెయిల్ అయినట్లే... అందుకే మళ్ళీ ప్రయత్నించాలనే ఉత్సాహం రావట్లేదు..."[29] అంటూ రవిచంద్ర తన బాధను వెళ్ళగక్కుతాడు.

---

**28. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 122**

**29. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 124**

తర్వాత కొన్నాళ్ళకి రవిచంద్ర కథను మెచ్చుకుంటూ ఉత్తరం వస్తుంది. ఆ ఉత్తరాన్ని సురేఖను చదవమని ఇస్తాడు. కథ ప్రచురితమైన మూడు నెలలకు ఉత్తరం వచ్చిందని ఆటపట్టిస్తుంది. అందుకు కారణం స్పందన తెలియజేసిన అమ్మాయికి వీక్లీ చదివే అలవాటు లేదని తన స్నేహితురాలిని కలవడానికి వెళ్ళినప్పుడు అక్కడ యధాలాపంగా తన కథ కన్పిస్తే చదివిందని అంటాడు రవిచంద్ర.

ఆ ఉత్తరాన్ని తీసి చదివి వినిపిస్తాడు. ఆ అతిశయోక్తులు వినలేక నన్నొదిలేయ్ నేనిక వినలేను అని అంటుంది. సురేఖ, రవిచంద్రల మధ్య ఏర్పడిన స్నేహం, చనువునీ గమనించి ఇరు కుటుంబాల పెద్దలు వీళ్ళిద్దరికి పెళ్ళి చేస్తే బాగుంటుందనే ఆలోచన కలుగుతుంది. రవిచంద్ర మొత్తం తన కథ చదివి స్పందన తెలిపిన తన అభిమానిని కనుగొనే ప్రయత్నంలో ఉంటాడు. అదే విషయం సురేఖతో చెబుతాడు. ఎందకని? ఆమె అడుగుతుంది. తనని చూడాలనిపిస్తోంది అని అంటాడు. సురేఖ పిచ్చితనం అంటుంది. రవిచంద్ర కాదు ప్రేమ అని అంటాడు. నువ్వేం మాట్లాడుతున్నావో... నీ ఉద్దేశం ఏమిటో నాకేం అర్ధం కావటం లేదని అంటుంది. ఆ అమ్మాయితోనే తన జీవితాన్ని పంచుకోవాలనిపిస్తుందని రవిచంద్ర సురేఖతో అంటాడు. సురేఖ కోపంతో ఆ అమ్మాయి ఎవరో ఏంటో తెలియకుండానే ఊహలు పెళ్ళివరకు వెళ్ళిపోతున్నాయని అంటుంది. ఆ ఉత్తరాన్ని బట్టి తనంటే ఆ అమ్మాయికి కూడా ఇష్టమేనని తెలుస్తుందని అంటాడు. రవిచంద్ర వైపు సురేఖ విస్మయంగా చూస్తుంది.

కొన్నాళ్ళు గడిచాక రవిచంద్ర, సురేఖల పెళ్ళి ప్రస్తావన వస్తుంది. సురేఖ నిరాకరిస్తుంది. అందుకు కారణం రవిచంద్ర ఆ అజ్ఞాత అభిమానిని ప్రేమించటమే అని తెలియజేస్తుంది. రవిచంద్రకు మారుపేరుతో అభిమానిగా ఉత్తరం రాసింది సురేఖేనని తెలుస్తుంది. అదే విషయం ఆమెకు తెలియజేస్తాడు. తన మాటల్లోని ఊత పదాలు ఆ ఉత్తరంలో చాలా చోట్ల దొర్లినట్లు తెలియజేస్తాడు. అందుకే ఆ ఉత్తరం రాసింది తానేనని తెలుసుకున్నానంటాడు. ఆ ఉత్తరం రాసిన అమ్మాయిని ప్రేమిస్తున్నానని చెబితే సురేఖ బయటపడుతుందని నటిస్తాడు. కానీ ఆమె కాదనేసరికి నిజం చెబుతాడు. తిరస్కరించటానికి కారణం అడుగుతాడు. సురేఖకు కూడా రవిచంద్ర అంటే ఇష్టమే కాని భవిష్యత్‌లో ఎవరైనా అభిమాని నిజంగా ఇలాంటి ఉత్తరం వస్తే తనని కాదని ఆమెని ప్రేమిస్తాడేమోనన్న సందేహంతో కాదంటుంది. కథాంతంలో ఒకరి భావాలు ఇంకొకరు అర్ధం చేసుకుంటారు. ఇరువురు పెళ్ళికి అంగీకరిస్తారు.

## సమీక్ష :

అభిమాని కథలో అంతర్లీన ప్రణయభావనను కలిగిస్తారు రచయిత్రి. కథలో ప్రధాన పాత్రలైన రవిచంద్ర, సురేఖలు ఒకరికొకరు బాగా ఇష్టపడుతుంటారు. ఒకరి అభిప్రాయాలు ఇంకొకరితో పంచుకుంటా ఉంటారు. రవిచంద్ర ఒక కథను రాసి సురేఖ అభిప్రాయంను తెలుసుకోవడానికి ఆమెను చదవమంటాడు. ఆ కథ ఇతివృత్తం ఆమెకు నచ్చలేదని నిర్మొహమాటంగా తెలియజేస్తుంది.

ఆ తర్వాత రవిచంద్రని కలిసినపుడు మాటల మధ్య మళ్ళీ ఏదైనా కథ రాశావా అని యథాలాపంగా సురేఖ అడుగుతుంది. రాయాలనే ఉత్సాహం లేదంటాడు. కారణం తన కథ నచ్చినట్లు ఒక్క ఉత్తరమైనా రాలేదని తెలియజేస్తాడు. నేను రాసిన మొదటి కథ నీకే కాదు ఎవ్వరికీ నచ్చలేదు. కావున ఇక కథలు రాయదలచుకోలేదని అంటాడు. మొదటి కథలోనే కీర్తిప్రతిష్టలూ, అభిమానుల ఉత్తరాలు రావు. నచ్చిన ప్రతివాళ్ళు ఉత్తరాలు రాయరు అంటుంది. ఏ కవికైనా ప్రోత్సాహం లేకపోతే నూతన రచనలు చేయలేదని అందుకే మళ్ళీ ప్రయత్నించలేదని రవిచంద్ర తెలియజేస్తారు.

సురేఖ మారుపేరుతో రవిచంద్ర కథను పొగుడుతూ ఒక ఉత్తరం రాస్తుంది. రవిచంద్ర తనకి కూడా అభిమానులు ఉన్నారని ఆనందంతో ఉప్పొంగిపోతాడు. సురేఖకు ఆ ఉత్తరాన్ని తీసుకెళ్ళి చూపిస్తాడు. ఆ ఉత్తరం రాసింది తనేనని తెలియజేయక పరిపరి విధాల ఆటపట్టిస్తుంది సురేఖ. రవిచంద్ర ఆ అజ్ఞాత అభిమాని ప్రేమలో పడతాడు. సురేఖతో ఈ విషయం చెబుతాడు. ఆమె విస్తుపోతుంది. ముక్కు మొహం తెలియని అమ్మాయిని ప్రేమించడం ఆమెకు హాస్యాస్పదంగా తోస్తుంది. సురేఖ, రవిచంద్రల స్నేహబంధాన్ని చూసిన ఇరు కుటుంబాలవారు వారిద్దరికి పెళ్ళి చేయాలని భావిస్తారు. అదే విషయం సురేఖతో చెబితే ఆమె నిరాకరిస్తుంది. రవిచంద్ర అంగీకరిస్తాడు. సురేఖని కారణం అడిగితే రవిచంద్ర మనసులో వేరొకరు ఉన్నారని అంటుంది. రవిచంద్ర ఆమెను నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాడు. నచ్చచెప్పే సమయంలోనే ఆ ఉత్తరం రాసింది సురేఖేనని తనకి తెలుసు అని అందుకే పెళ్ళికి ఒప్పుకున్నానని చెబుతాడు. పెళ్ళైన తర్వాత అంతకంటే అభిమానంతో ఎవరైనా ఉత్తరం రాస్తే నన్నొదిలేస్తావేమోనని అనుమానం వ్యక్తపరుస్తుంది సురేఖ.

ఆ సందర్భంలో రవిచంద్ర చేత ఇలా పలికిస్తారు రచయిత్రి.

"నువ్వు రచయితగా నా అభిమానివి కాకపోవచ్చు. కానీ నన్నుమితంగా అభిమానించే దానివి కాబట్టే మారుపేరుతో ఉత్తరం రాసి నాకుత్సాహం కలిగించాలని తాపత్రయపడ్డావు. అందుకే నేను నా అభిమానినే పెళ్ళి చేసుకుంటానని గట్టిగా నీకు చెప్పగలిగాను. రచయితిగా కూడా నీ అభిమానాన్ని పొందటానికి కృషి చేస్తాను"[30] రచయితకు ప్రశంసలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి. కానీ నిజాయితీగా చేసే విమర్శలే మంచి రచయితగా ఎదగటానికి ఉపయోగపడతాయని ఈ కథ ద్వారా తెలియజేసారు రచయిత్రి. నిజమైన అభిమాని కథలో తనకి నచ్చిన అంశాలతో పాటు, నచ్చని అంశాలను కూడా చెప్పగలగాలి. అటువంటి అభిమానిని సంపాదించుకున్నప్పుడు రచయిత సఫలీకృతుడైనట్లే.

కథలో రచయిత్రి ప్రణయాన్ని ఎక్కడా వర్ణించనప్పటికి రవిచంద్ర, సురేఖలు ఒకరిపట్ల ఇంకొకరు చూపే ప్రేమానురాగాలు పాఠకుడికి ఒక నిర్వచనీయ అనుభూతి కలుగుతుంది. ప్రణయ సంబంధ కథలు తర్వాత చెప్పుకోదగ్గవి మానవీయవిలువలకు సంబధించిన కథలు.

## 2.3 మానవీయ విలువలకు సంబంధించిన కథలు :

మానవీయ విలువలు అంతకంతకు అడుగంటుకుపోతున్నాయి. మానవత్వం లేని సమాజం త్వరలో చూడబోతున్నాం. మానవత్వం లేకపోవటం వల్ల ఎన్ని అరాచకాలు, ఎన్ని హత్యలు జరుగుతున్నాయి. మనిషి ఏనాడైతే నైతికతను కోల్పోయాడో ఆనాడే మానవీయత దెబ్బతింది. శాస్త్ర, సాంకేతిక, విద్య, వైజ్ఞానిక రంగాల్లో దేశం ఎంత అభివృద్ధి చెందుతున్నా మానవీయ విలువలు అంతవేగంగా కనుమరుగవుతున్నాయి. దానికి కారణం ప్రజల్లో నీతి, న్యాయం, ధర్మం, శాంతి, సహకారం మొదలైనవన్నీ కనుమరుగవుతున్నాయి. ఆదరణ లేదు. అసాంఘిక స్థితి రాజ్యమేలుతుంది. అటువంటి అంశాలను ప్రధానాంశాలుగా చేసుకుని రచయిత్రి గోగినేనిమణి కొన్ని కథలు రాశారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే మానవీయ విలువలు తెలుస్తాయి.

### 2.3.1 కెనడా మామయ్య :

రచయిత్రి స్వయంగా ఈ కథలో ఒక పాత్రగా లీనమై కథను నడిపించారు. కథంతా కెనడాలో ఉండే మామయ్య చుట్టూనే నడుస్తుంది. తల్లిపాత్ర ద్వారా ఆమె తమ్ముడైన

30. మనసునమల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 128